


# పరుగు

— నందిగం కృష్ణారావు

నేనేడుస్తున్నానో పరుగెడుతున్నానో తెలవడం లేదు. అనుక్షణం నే వెనక పడిపోతున్నానేమోనన్న భయం పీడిస్తోంది. నాకంటే ముందర చాలా మంది ఒకరి మీద ఒకరు పడుతూ, ఒకర్నొకరు నెట్టేసుకొంటూ, ఒకర్నొకరు తిట్టుకొంటూ నడుస్తున్నారు. నడుస్తున్నారంటే తప్పేమో పరిగెడుతున్నారు. కసువుని చూసి పందులు పరిగెట్టుకెళ్ళి మీద పడ్డట్టుగా సమస్తాన్నీ తమ సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. వాళ్ళ మూతులు వాళ్ళకి మురికి కంపు కొట్టడం లేదు. వాళ్ళని చూస్తే నాకసహ్యం వేస్తోంది. అయినా ఎందుచేతో నాకు తెలవకుండానే నేను కన్వేయర్ బెల్ట్ మీద నిల్చున్న వాళ్ళా ముందుకు పరిగెడుతున్నాను. పడిపోతానేమోనన్న భయం తప్ప ఈ పరుగు పందెం నించి తప్పుకోవాలన్న ధ్యాస లేదు.

నాకంటే వెనక వచ్చిన వాళ్ళు నన్ను పక్కకి నెట్టేసి ముందుకు మున్ముందుకు పరిగెట్టాలని చూస్తున్నారు. నాతోపాటూ పరిగెడుతున్న వాళ్ళు నన్ను వెనక్కి నెట్టేసి పరిగెట్టాలని చూస్తున్నారు. వాళ్ళందర్నీ తప్పించుకొంటూ, వాళ్ళకంటే ముందు గమ్యం చేరాలన్న ధ్యాస తప్ప నాకింకో ఆలోచన లేకుండా పోతోంది. ఈ పరుగు పందెంలోకి నేను ఎప్పుడు ప్రవేశించానో నాకు సరిగ్గా గుర్తుకు రావడం లేదు.

ఎప్పుడో నా అయిదో ఏటో ఆరో ఏటో నాకిష్టం లేకుండా నన్ను బలవంతంగా బడికి పంపినప్పుడనుకొంటాను 'నేను వెళ్ళనమ్మా నేను వెళ్ళను' అని ఎంతేడ్చినా వినకుండా బడికి పంపారు. అప్పుడు నేను మా అమ్మ గుండెల్లోంచి ఒక తునకనై రాలిపోయాను. 'అమ్మా అమ్మా నన్ను పట్టుకో అమ్మా' అంటూ నే ఏడ్చిన ఏడ్పు నాకు తప్ప ఇంకెవరికీ వినిపించలేదు.

అమ్మ నన్ను పట్టుకోలేదు. నన్ను తన దగ్గరికి రానివ్వలేదు.

''చిరిగిన కొంగు జూపి నాన్నా నాకు కొత్త గుడ్డలు కొనివ్వవు' నువ్వు చదువుకొని పెద్దవాడివై పెద్ద ఉద్యోగం చేసి నాకు కొత్త బట్టలు తెస్తావు కదూ?'' అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకొంది. నా కోసం చందమామని రమ్మని, జాబిలమ్మని రమ్మని పిలిచిన అమ్మ ఎందుకో నిస్సహాయంగా నిలబడి పోయిందనిపించింది. కాదనలేక పోయాను అమ్మ మాట. ''టైం అయిపోతోంది. వాణ్ణి తొందరగా తెముల్చు'' అని అరిచాడు నాన్న.

అప్పటికే నన్ను తీసుకెళ్ళడానికి ఒక రిక్షా పిలిపించాడు. అమ్మ నన్ను హడావుడిగా తయారుచేసి బలవంతంగా స్కూల్కి పంపింది.

''చూడు ఆయన పోలీసైయ్యాడంటే... ఎంతో కష్టపడి చదువుకుంటేనే అయ్యాడు'' అని పోలీసులని చూపించి చెప్పేవాడు నాన్న. ఎలాగైనా కష్టపడి చదివి పోలీసులై స్కూళ్ళు మూయించెయ్యాలనుకొన్నాను.

''మా నాన్న చదువుకొని కలెక్టర్ అవుతాడు'' అని మురిసిపోయేది అమ్మ.

చదువుకొంటే ఏదైనా అయిపోవచ్చు, ఎవరి నెత్తిమీదైనా కూర్చుని పెత్తనం చెయ్యవచ్చు అన్న అభిప్రాయం ఏర్పడింది. అలా నేను చదువుకొని పైకి రావాలంటే కొందరైనా చదువూ సంధ్యా లేకుండా ఉండిపోవాలి. లేదా చదువులో నేను ముందుండి వాళ్ళు వెనకుండాలి. అప్పుడే నేను అందరికంటే ముందుంటా నన్న సంగతి నాకు ఎవరూ చెప్పకపోయినా తెలిసిపోయింది. అందుచేత నేను స్కూల్లో ఫస్ట్ రావడానికి కష్టపడి చదివాను. నాలాగే నా క్లాస్మేట్స్ అందరూ కూడా ఫస్ట్ రావాలని ప్రయత్నం చేసేవాళ్ళు. ఒకర్నొకరం ఎంత ఇష్టపడ్డా ఎంత కల్సి ఉన్నా ఒకరికంటే ఒకరం చదువులో ముందుండాలనీ ప్రయత్నించేవాళ్ళం. వీలైతే ఒకర్నొకరం ప్రక్కదారి పట్టించేవాళ్ళం. నాకు తెలిసినవి తెలవనట్లుగా నటించేవాణ్ణి. అవర్స్ గైడ్ బాగుంటే స్వస్తిక్ గైడ్ బాగుంటుందని చెప్పేవాణ్ణి. పరీక్షల్లో వాళ్ళు తప్పులు రాస్తే నేను ఎంతో సంతోషించేవాణ్ణి. అలా నా స్కూల్, కాలేజీ జీవితం ముగిసింది. నేను చాలా బ్రిలియంట్ స్టూడెంట్నని పేరు తెచ్చుకొన్నాను. అన్ని పరీక్షల్లోనూ ఫస్ట్లో పాస్ అయ్యాను. నన్ను చూసి నేనే సంతోషించాను. నేనే గర్వపడ్డాను. నా వెనుక ఇంకా పరిగెడుతున్న వాళ్ళని చూసి నవ్వుకొన్నాను. ఇంకా నా ముందు ఎవరూ ఉండరు. ఉంటానికి వీల్లేదు. ఈ లోకానికంతటికీ నేనే అధిపతినీ, మకుటం లేని మహారాజుని. ఉద్యోగం పేరిట నా ఆధిపత్యాన్ని ప్రకటించడానికి ఇంక ఎన్నో రోజులు పట్టవు అనుకొన్నాను.

సర్వీస్ కమీషన్ పరీక్ష రాశాను. నాతో ఎన్నో వేల మంది పరీక్షకి హాజరయ్యారు. పరీక్షలో పాస్ అయ్యాను. వందల మంది నాతోపాటూ ఇంటర్వ్యూకి వచ్చారు.

వెనకపడ్డ వాళ్ళని చూసి నవ్వుకొన్నాం.

ఇంటర్వ్యూలు మొదలౌతాయనగా తిరిగి నాతోపాటూ పరీక్ష పాస్ అయిన వాళ్ళకీ నాకూ పోటీ మొదలైంది. ఒక్కో ఖాళీగా పదిమంది అభ్యర్థుల్ని పిలిచారు. నాతోపాటూ ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళంతా నా నోటి దగ్గర కూడు తన్నుకుపోయే కాకుల్లా, గెద్దల్లా కనిపించారు.

ఇంటర్వ్యూ చేసే అధికార్లెవరో వాళ్ళ కులాలేమిటో తెలుసుకొన్నాను. అందులో ఒకరు మా కులం వాడు ఉన్నాడని తెలుసుకొని సంతోషించాను.

ఎవరైనా బోర్డులో ఎవరున్నారోయి అంటే నాకేమీ తెలవనట్లు నటించాను. ''ఎవరుంటేనేం వాళ్ళని మనం ఫేస్ చెయ్యాల్సిందే కదా?'' అన్నాను.

చైర్మన్ డబ్బులిస్తింటాడని తెల్సి ఇంట్లో పోరి రెండెకరాల భూమి అమ్మించి లంచం ఇప్పించాను.

మా నాన్న మా కులపు మెంబర్ ఇంటికి వెళ్ళి బంధుత్వాలు తిరగేసి మాకూ, ఆయనకీ దూరపు బంధుత్వముందని తేల్చాడు. రోజులు మారిపోయాయి కాబట్టి మనం ఇంత దూరమై పోయాము కానీ లేకపోతే మనం ఎంతో దగ్గరవాళ్ళం కదా అని ఆయన్ని నమ్మించాడు.

అన్ని కులాల్లోకీ మా కులమే ఇంకా కుల భ్రష్టత్వం కాలేదన్నాడు. అదే మిగతా వాళ్ళని చూడండి ఎంత చెడిపోయారో నన్నాడు. కొందరు కులాల్ని డబ్బు సంపాదించుకోవడానికి అడ్డు పెట్టుకొంటున్నారన్నాడు, కొందరు, అదే కొందరు తమ కులం వాళ్ళకే పెద్దపీట వేసి కూర్చోబెడుతున్నారన్నాడు. ఎటొచ్చీ నా తప్పు లేకుండా నడుచుకోవడం మూలాన మా కులపోళ్ళే ఎటూ కాకుండా అయిపోయారన్నాడు.

ఇదంతా విని ఆయన కూడా ''నిజమే... నిజమే'' నంటూ బుర్ర ఊపాడు. ఆ తరువాత ఆయన దృష్టి నా మీద పడింది. ''ఈ కుర్రాడెవరు'' అన్నాడు.

''మావాడే... మొన్న ఎం.ఏ. ఫస్టున ప్యాస్ అయ్యేడు''

''గుడ్... సర్వీస్ కమీషన్కి అప్లై చేశారా?'' అని అడిగాడు.

''ఆ పరీక్ష కూడా అయింది. ఇహ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయితే ఉద్యోగం వచ్చినట్టే''

''గుడ్... చూద్దాం'' అన్నాడు తరువాత.

నాకేసి చూసి ''ఆల్ ది బెస్ట్'' అన్నాడు.

ఆ తరువాత మేము సెలవు తీసుకొని బయటకు వచ్చేశాం. ఇంతసేపు మేము ఏ తోడేలు శరీరంలోనో, నక్క ఒంట్లోనో పరకాయ ప్రవేశం చేశాం అనిపించింది. బయటకొచ్చిన తరువాత నా ఒంట్లోకి నేనొచ్చేసినంత రిలాక్స్డ్గా ఫీలయ్యాను.

''ఇంతకీ ఆడేంటి తేల్చాడంటావ్'' అని అడిగాడు మా నాన్న.

అతనన్న దాన్ని బట్టి ఆయన ఏం తేల్చాడో నేను తేల్చుకోలేకపోయాను.

''పైకేమీ తేల్చలేదు కానీ కాదనలేదు కదా? అందుసేత ఆయన మనకి తప్పకుండా సాయం సేస్తాడు'' అన్నాడు నాన్న.

ఆయన మాటల్లో కొంత నిజం ఉందనిపించింది. నాలో కొత్త ఆశలు చిగురించాయి.

''బోర్డులో అరవ బ్రాహ్మడొకడున్నాడట. అడు సహాయం అంటూ సేస్తే అరవ బ్రాహ్మలకే సహాయం చేస్తాడట. తప్పితే మిగతా వాళ్ళ విషయంలో మహా స్ట్రిక్ట్ అట'' అని కబురు తెచ్చాడు మా క్లాస్మేట్ ఒకడు.

గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి. రాత్రింబగళ్ళు ఇంటర్వ్యూకి ప్రిపేర్ అయ్యాను.

నాకంటే ముందు ఇంటర్వ్యూకి హాజరైన వాళ్ళని కట్టుకొని ఏం అడిగారని తెలుసుకొన్నాను. ఆ ప్రశ్నలన్నిటికీ ప్రిపేర్ అయ్యాను.

నేను ఇంటర్వ్యూకి వెళ్ళినపుడు మా కులపాయనా, మా చైర్మనే నన్ను ప్రశ్నించారు.

నే చెప్పిన జవాబులు సంతృప్తికరంగా ఉన్నాయన్నట్లు మొహం పెట్టి పక్కవాళ్ళ ఆమోదం పొందారు.

ఇంటర్వ్యూ సంతృప్తికరంగా ముగిసింది. ఆనందంగా బయటకు వచ్చాను. ''ఎలా జరిగింది''ని ప్రశ్నించిన వాళ్ళకి బాగానే జరిగిందని చెప్పాను.

''ఏం అడిగారు?'' అని అడిగిన వాళ్ళకి చాలా కష్టమైన ప్రశ్నలు వేశారని చెప్పాను. అందరూ డీలా పడిపోయారు. నాకెందుకో వాళ్ళని చూస్తే నా చేతిలో ఓడిపోయి నిస్సహాయ యోధుల్లా కనిపించారు.

ఉద్యోగం వచ్చింది.

మా అమ్మా నాన్నలు నా గొప్పదనం గురించి కనిపించిన వాళ్ళందరికీ చాటి చెప్పడం మొదలుపెట్టారు.

పెద్దపెద్ద వాళ్ళెందరో నాకు చాలా కట్నం ఇచ్చి పిల్లనిస్తామని వస్తున్నారనీ, అయినా నేను ఎటూ తేల్చడం లేదని, ప్రమోషన్ వచ్చేవరకూ నేను చేసుకోనంటున్నానని చెప్పుకొని బాధపడ్డం మొదలుపెట్టారు. ఇది అబద్ధమని తెలిసి కూడా నేను ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు ఏదైనా నా మంచి కోసమే చేస్తారన్న ధీమా నాకుంది. అయినా ''నాకు ప్రమోషన్ రావడానికి ఇంకా చాలాకాలం పడుతుంది'' అని చెప్పాను ఒకసారి వాళ్ళు నా పెళ్ళి గురించి మాట్లాడుతున్నప్పుడు.

''అది మాకు తెలవక్కాదు. నీకు ఇంకా ఎక్కువ కట్నం ఇచ్చి పిల్లనిచ్చే అత్తగార్ని చూడ్డానికి...'' అని చెప్పి నా అనుమానాన్ని పూర్తిగా తొలగించాడు మా నాన్న.

నా ఉద్యోగం ఎంతో మంచిదనీ, నా భవిష్యత్తు ఇంకా బాగుంటుందనీ, చిన్నప్పుడు నా జాతకం చూసిన జ్యోతిష్కులే నాది అమోఘమైన జాతకం అని చెప్పారనీ మా అమ్మా నాన్న నా గురించి ప్రచారం చేశారు.

రాజారావు అనే ఒక రియల్ ఎస్టేట్ డీలర్ మా వాళ్ళ గాలంలో పడ్డాడు. ఆయనకి బోల్డంత ఆస్తి ఉంది. ఆయన క్రింద ఓ వందమంది పనివాళ్ళు ఉన్నారు. ఆయనకు మగపిల్లల్లేరు. ఉన్నది ఒక్కతే కూతురు. ఆ కూతుర్ని ఆయన అల్లారుముద్దుగా పెంచాడు. అడిగినవన్నీ కొనిచ్చాడు. అందుచేతో మరెందుచేతో కానీ ఆ అమ్మాయి బొద్దుగా వాళ్ళ అమ్మా నాన్నలకి మాత్రమే ముద్దుగా కనిపించేది. ఎదిగొచ్చిన పిల్లైనా ఆ అమ్మాయిని వాళ్ళ అమ్మా నాన్నలు చిన్నప్పుడు పెట్టిన ముద్దు పేరు తోటే 'బేబీ' అని పిలిచేవాళ్ళు.

అన్నీ వున్న రాజారావుకి కొడుకుల్లేరన్న బాధ లేదు. కానీ అధికారం లేదన్న దిగులు మాత్రం ఉండిది. అది కొనుక్కోవడానికి, మేం వాళ్ళకంటే తక్కువాళ్ళమైనా నన్ను అల్లుణ్ణి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. నాకు ఆయనకి అల్లుడ్ని కావడం కంటే ఆయన కూతురికి మొగుడ్ని కావడమంటే ఇష్టం లేకపోయింది.

ఆ మాట మా వాళ్ళతో అంటే వాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. ''అందాందేముంది కొరుక్కు తింటామా? పిల్ల బంగారం. ఆ పిల్ల పుట్టగానే వాళ్ళ నాన్నకి కల్సి వచ్చింది. నోరు మూసుకొని పెళ్ళి చేసుకో'' అన్నారు.

అలాగ నా పెళ్ళి బేబితో జరిగిపోయింది. బేబి నన్నెప్పుడూ భర్తలా చూడలేదు. భర్తలా చూడలేదనడం కంటే మనిషిలా చూడలేదంటే బాగుంటుందేమో. ఆమెకి తన తండ్రి కొనిచ్చిన వస్తువులకీ నాకూ మధ్యన ఏమీ తేడా కనిపించలేదు.

అత్తగారింట్లో నేను ఆళ్ళ పెంపుడు కుక్కలా మారిపోయానేమోనని పించింది. దానికితోడు మా మామగారు నాకున్న అధికారంతో సంతృప్తి పడలేదు. అందుచేత నన్ను ఇంకా ఇంకా పైకి రావాలని ప్రోత్సహించేడు.

అంచెలంచెలుగా నాతోటి వారితో పోటీ పడుతూ నేను ఐఎఎస్ అధికారినయ్యాను. అప్పుడు మాటిమాటికీ నా నెత్తిమీద మొట్టే కార్యదర్శిని చూసి ఎలాగైనా సరే జీవితంలో కార్యదర్శి నవ్వాలనుకొన్నాను. పట్టుదలగా రాత్రింబగళ్ళు పనిచెయ్యసాగాను. రాజకీయ నాయకుల దగ్గరా, మంత్రుల దగ్గరా అణకువగా ఉండసాగాను. వాళ్ళ ప్రాపకం సంపాదిస్తే జీవితంలో నేను ఏదైనా అయిపోవచ్చునన్న అభిప్రాయం ఏర్పడింది. అప్పటినించీ నేను రాజకీయ నాయకుల పనివాడినన్నట్లుగా ప్రవర్తించాను. నేను ఒక్కణ్ణే కాదు, నాతో సమానమైన హోదా ఉన్నవాళ్ళూ, నాకంటే తక్కువాళ్ళూ, నాకంటే ఎక్కువాళ్ళు కూడా అలాగే నడుచుకొనడం నాక్కనిపించింది. బూట్లు నాకడానికి కుక్కలు పోటీ పడుతున్నట్లుండేది.

ఒక్కొక్కసారి నాకు విసుగ్గా ఉండేది. ఈ పరిస్థితి నించి తప్పుకోవాలనిపించేది. అలా చేస్తే నన్ను ఏ దూర ప్రాంతాలకో బదిలీ చేస్తారో, లేక రావల్సిన ప్రమోషన్ని రానివ్వకుండా చేస్తారేమోనని భయపడ్డాను.

నాకు పుట్టిన పిల్లలు ఎదిగొస్తున్నారు. వాళ్ళని ఏ అధికారం లేని పశువుల్ని చెయ్యకూడదు. ఆళ్ళు నాకంటే ఉన్నతంగా బ్రతకాలన్న కోరిక నన్ను తరుముతూ ఉంది. అందుచేత ఇప్పుడు నేను ఆళ్ళ కోసం పరిగెడుతున్నాను. ఈ పరుగు పందెంలో ఒకోసారి నా వెనకబడ్డ నా చిన్ననాటి స్నేహితులు సైతం నాకెదురుపడి ''మా వాడికి ఎంసెట్లో ర్యాంక్ వచ్చిందోయ్'' అనో, ''సర్వీస్ కమీషన్ పరీక్షలో మా అమ్మాయికి మెరిట్ వచ్చింది''అనో చెప్పినప్పుడు ఈ పందెంలో నేను ముందున్నానో వెనకపడ్డానో నాకు అర్థమయ్యేది కాదు. అందుచేత అవిశ్రాంతిగా అందర్నీ గెలవాలన్న ఆరాటంతో, తపనతో నిరంతరం పరిగెడుతూనే ఉన్నాను.

చివరికి నా గమ్యాన్ని ఎరక్కుండా అదే పనిగా పరిగెడుతున్నాను.

కన్వేయర్ బెల్ట్ మీద నా ప్రమేయం లేకుండా ఏ మహారాక్షసుడికో ఆహారం కావడానికి పరిగెడుతున్నాననిపించి భయం వేసింది.

చిన్నప్పుడు అమ్మ చెప్పిన ఒక కథ ఈ మధ్యన తరచూ గుర్తుకు వస్తోంది.

అడవికి రాజు సింహం. ఆ సింహం కనిపించిన జంతువునల్లా వేటాడి, చంపి తినేసేది. ఇలా జంతువుల్నన్నిటినీ సింహం తినేస్తే ఎలాగని జంతువులన్నీ ఆందోళన పడ్డాయి. రోజుకొక జంతువు చొప్పున సింహానికి ఆహారంగా వెళ్ళాలని అవి నిర్ణయించుకొన్నాయి. ఆ విషయం సింహానికి చెప్పాయి. సింహం అందుకు సంతోషంగా ఒప్పుకొంది. రోజుకొక జంతువు చొప్పున సింహానికి బలిచ్చాయి జంతువులన్నీ. ఒక తెలివైన చెవలపిల్లి ఆ సింహానికి పోటీగా మరో సింహం వచ్చిందని చెప్పి, సింహం బావిలో పడి చనిపోయేలా చేసింది. అప్పటినించీ జంతువులన్నీ సుఖంగా సంతోషంగా బ్రతుకుతున్నాయి.

అడవులు కొట్టేశారు. జంతువులు మనుషుల్లా మారిపోయారు. సింహం కొత్త రూపాన్ని సంతరించుకొంది. అది ఎక్కడో ఆకలితో నోరు తెరుచుకుని ఉంది. దాని కడుపులో అపారమైన సంపదనీ, అంతుపొంతులేని సుఖ సంతోషాల్ని అన్వేషించడానికి ఒకర్నొకరు నెట్టేసుకొంటూ, ఒకరితో ఒకరు పోటీ పడుతూ కన్వేయర్ బెల్ట్ మీద పరిగెడుతున్నాం.

చివరకేమౌతుంది? అన్న ప్రశ్న నన్ను వెంటాడుతోంది.

చివరికి ఆ మహా రాక్షసుడి కడుపులోనో, ఆ సింహం కడుపులోనో ఒక చిన్న మాంసం ముద్దగా మిగిలిపోతానేమో ననిపించింది. భయంతో పందెం నించి ప్రక్కకి తప్పుకోవాలనుకొన్నాను.

అలా కుదరలేదు. కుదరడం లేదు. అలవాటుపడ్డ నా కాళ్ళు పరిగెడుతూనే ఉన్నాయి. నా ప్రమేయం లేకుండానే, నా ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా పరిగెడుతూనే ఉన్నాను ☆